క్లుప్తంగా

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న గిజా పిరమిడ్ వ్యవస్థాపకురాలు లీలా ప్రసన్నకుమారి

మునగపాక: ప్రతి ఒక్కరూ ధ్యానంపై దృష్టి సారించాలని, అప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీగిజా పిరమిడ్ వ్యవస్థాపకురాలు సరిసా లీలా ప్రసన్నకుమారి అన్నారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శ్రీగిజా పిరమిడ్ ఆధ్వర్యంలో ధ్యానంపై రెండు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సును మంగళవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా మొదటి రోజున జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా రోజంతా ఉత్సాహంగా ఆరోగ్యంగానూ ఉండవచ్చన్నారు. ఎటువంటి రోగాలు దరిచేరవన్నారు. అంతేకాకుండా మనస్సు నిర్మలంగా ఉంటుందన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

మాకవరపాలెం: ఆన్‌రాక్ నిర్వాసితుల సమస్యలను గడువులోగా పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు స్పష్టం చేశారు. తామరంలో మంగళవారం మాట్లాడుతూ అధిక లోడుతో వెళుతున్న లారీలను నాలుగు రోజులు అడ్డగించి విడిచిపెట్టిన సందర్భంగా 15 హామీలను 15 రోజుల్లో అమలు చేస్తామని పయినీర్ యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. మొదటగా రోడ్డు వెడల్పు పనులు చేపట్టడం హర్షనీయమన్నారు. మిగిలిన వాటిని కూడా పరిష్కరించే చర్యలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో శెట్టిపాలెం, భీమబోయినపాలెం సర్పంచ్‌లు రామునాయుడు, కిషోర్ పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ



ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం : బూరుగుపాలెంలో పరదేశమ్మ పండగను వైభవంగా నిర్వహించారు. ఏటా భారీ ఎత్తున పండగను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం కూడా స్థానికులంతా పండగను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయానికి చేరుకుని పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేయడంతోపాటు రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పండగలో మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు శ్రీమహాలక్ష్మి అమ్మవారు పండగ

నాతవరం : మండలంలో లింగంపేట గ్రామంలో వెలసిన శ్రీమహాలక్ష్మి అమ్మవారు పండగను బుధవారం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ అమ్మవారిని గ్రామదేవతగా పూర్వం నుంచి గ్రామస్తులు పూజిస్తున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో వచ్చే మాఘపౌర్ణమి రోజున మహాలక్ష్మి అమ్మవారు పండగను జరుపుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా అమ్మవారు పండగను సంప్రదాయంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రహదారికి మరమ్మతులు



కె.జె.పురం మోదమాంబ ఆలయం సమీపంలో తారు రోడ్డు రోలింగ్ పనులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం ప్రధాన కూడలి(జంక్షన్) నుంచి గ్రామం మీదుగా దబ్బుకుంటు రహదారి గుండా మాడుగుల పోవు రహదారి మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో 2 కిలోమీటర్లు 600 మీటర్లు పొడవు కలిగిన ఈ రహదారి మరమ్మతు పనులకు ఆర్అండ్‌బీ నుంచి రూ.8 లక్షలు మంజూరు చేశారు. రహదారి పూర్తిగా గోతులమయం అయిన చోట తారుతో రోలింగ్ చేస్తున్నారు. పనులను ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ పైలా దేముడునాయుడు, సర్పంచ్ జామి రమణబాబు పర్యవేక్షించారు.

హలో... మీ పార్శిల్ వచ్చింది..!



ప్రజా రవాణా సంస్థ ప్రయాణికులు, వ్యాపారుల సరుకులు, పార్శిల్ సర్వీసులను మరింత విస్తృతం చేసింది. కొరియర్‌ను ప్రజల ఇంటి వద్దకే చేర్చేందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ దృష్టి పెట్టింది. కేజీ నుంచి యాభై కిలోల వరకూ బస్ స్టేషన్ నుంచి 10 కిలోమీటర్ల లోపు దూరంలో వినియోగదారులకు డోర్ డెలివరీ సదుపాయం కల్పించింది.

- ఇంటి వద్దకే ఆర్టీసీ పార్శిల్ సేవలు
- డోర్ డెలివరీ సేవలు మరింత విస్తృతం



ఆర్టీసీ పార్శిల్ సర్వీసు కేంద్రం

నర్సీపట్నం : ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ సేవలను మరింత విస్తృతం చేస్తోంది. గతంలో ఒక పట్టణం నుంచి మరో పట్టణంలోని ఆర్టీసీ పార్శిల్ కేంద్రాలకు మాత్రమే సేవలు ఉండేవి. వినియోగదారులు తమకు వీలున్నప్పుడు బస్‌స్టేషన్‌కు వెళ్లి పార్శిల్‌ను తెచ్చుకునేవారు. ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ప్రజా రవాణా సంస్థ వారు డోర్ డెలివరీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. బుకింగ్ సమయంలో డోర్ డెలివరీ అని ఆప్షన్ ఇస్తే సిబ్బంది సంబంధిత చిరునామాకే కొరియర్‌ను అందిస్తున్నారు. ఆర్టీసీ పూర్తి స్థాయి సేవలపై దృష్టి పెట్టి, డోర్ డెలివరీ విధానాన్ని తెచ్చి, ప్రైవేటు కొరియర్ సర్వీసులకు దీటుగా సేవలందించేందుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లిలో ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలు అమలవుతున్నాయి.

50 కేజీల వరకూ...

డోర్ డెలివరీకి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా డెలివరీ బాయ్స్‌ను నియమించుకున్నారు. 10 కేజీల నుంచి 50కి పెంచి ఇంటి వద్దకే కొరియర్ సేవలందిస్తున్నారు. బస్టాండ్ నుంచి 10 కిలోమీటర్లలోపు కవర్లు, పార్శిళ్లు, బాక్సులు, సంచులు, ప్యాకెట్లను కార్యాలయాలు, షాపులు, వ్యాపార సంస్థల వద్దకే వెళ్లి అందిస్తున్నారు. డెలివరీ సమయంలో యజమాని సెల్ నెంబర్, సంతకం, ఫోటో తీసుకుని అప్పగించి వస్తున్నారు. డోర్ డెలివరి కోసం అదనంగా ఛార్జీలు వసూలు చేయనున్నారు. 1 నుంచి 10 కేజీల బరువు ఉంటే రూ.20, 10 నుంచి 25కేజీలోపు ఉంటే రూ.30, 25 నుంచి 50 కేజీలలోపు బరువు ఉంటే రూ.48 చొప్పున వసూలు చేస్తున్నారు. పార్శిల్ సర్వీసు ద్వారా గత ఏడాది డిపోకు రూ.47 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.60 లక్షల మేర ఆదాయం వచ్చింది.

ప్రైవేటు కంటే మెరుగ్గా సేవలు



కొరియర్, పార్శిల్స్ రంగంలో ప్రైవేటు సంస్థల కంటే మెరుగ్గా డోర్ డెలివరీ సేవలందించేందుకు చర్యలు చేపట్టాం. 50 కేజీలోపు బరువు పార్శిల్స్‌ను ఆయా చిరునామాకు తీసుకెళ్లి ఇస్తున్నాం

–ధీరజ్,మేనేజర్, నర్సీపట్నం డిపో

భారత వికాస్ పరిషత్ వితరణ



గోడుగుమామిడిలో వస్త్రాలు పంపిణీ చేస్తున్న పరిషత్ సభ్యులు

చీడికాడ: అనకాపల్లి భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో కోనాం పంచాయతీ శివారు గ్రామాలు గోడుగుమామిడి, చెరకుబిల్లిలో మంగళవారం 80 కుటుంబాలకు వస్త్రాలు పంపిణీ చేశారు. భారత వికాస్ పరిషత్ వనవాసీ కల్యాణ యోజన కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.70 వేల విలువ చేసే చీరలు, దుప్పట్లు, తువ్వాలు, లుంగీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిషత్ జోనల్ మహిళా కన్వీనర్ పిళ్లా నిర్మల, ప్రాంతీయ కన్వీనర్ గోపాలరావు, వనవాసీ కళ్యాణ యోజన కన్వీనర్ మహేశ్వరావు, ఎస్‌ఐ బి.సతీష్, కోనాం సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, వికాస్ పరిషత్ అనకాపల్లి శాఖ అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి దాడి శివరామ్, కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిఘా నీడలో ఘాట్‌రోడ్, మాడుగుల జంక్షన్‌లు



మాడుగుల పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన దృశ్యం

మాడుగుల: మండలంలో అత్యంత రద్దీగా ఉండే ఘాట్‌రోడ్ జంక్షన్‌లో నాలుగు సీసీ కెమెరాలు, మాడుగుల పట్టణం ప్రధాన కూడలిలో 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ జంక్షన్‌లో రాత్రిపూట మద్యం తాగి గొడవలు సృష్టించడం జరగడంతో వీటిని అరికట్టడానికి ఎస్‌ఐ. జి. నారాయణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాహన చోదకులు కూడా తమ వాహహనాలు స్పీడుగా నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆకతాయిగా వాహనాలు నడిపేవారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీసులు ముందు జాగ్రత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో జంక్షన్‌వాసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఇకపై తావులేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మోదకొండమ్మ ఆలయంలో పూజలు



సత్యవరం పెద్దేరు నది వొడ్డున మాఘపౌర్ణమి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం మాఘమాసం సందర్భంగా మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగుల మండలంతో పాటు ఇతర మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ భక్తులకు సులువుగా అమ్మవారిని దర్శించుకోవడానికి దర్శన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రసాదం అందజేసారు. అలాగే సత్యవరం గ్రామంలో మంగళవారం మాఘపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పెద్దేరులో స్నానాలు ఆచరించి నది వొడ్డున ధర్మప్రచారకులు తవ్వా సన్యాసి శెట్టి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ పక్కనే వెలసిన శివలంగాన్ని దర్శించుకున్నారు.

పది ఫలితాల సాధనకు పక్కా ప్రణాళికలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఈవో జగ్గారావు

రోలుగుంట: శని,ఆదివారాలు పది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఆదేశాల మేరకు అమలు జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి పూడి జగ్గారావు తెలిపారు. పది ఫలితాలు సాధన, చర్యల గురించి తాను మంగళవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీతో కలిపి మండలంలో గల ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీతో కలిపి తొమ్మిది పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు 331 మంది హాజరు కానున్నారన్నారు. శతశాతం ఫలితాలు సాధనలో భాగంగా విద్యార్థులకు పాఠశాలలో బోధనా సమయానికి ముందు, తరువాత గంటన్నర ప్రత్యేక బోధన, అలాగే విదార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి నైట్ స్టడీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రధానంగా రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలలో కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసి, విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు.

వ్యవసాయ కనెక్షన్లకు అందని విద్యుత్ సరఫరా



కరకలో నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

బుచ్చెయ్యపేట : కరక గ్రామంలో దళిత రైతులకు చెందిన వ్యవసాయ కనెక్షన్‌కు విద్యుత్ సరఫరా లేక రైతుల పంటలు ఎండిపోతున్నాయి. గ్రామానికి చెందిన 15 మంది రైతులకు 16 ఏళ్ల కిందట విద్యుత్‌లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. వ్యవసాయ మోటార్లు బిగించి సాగునీటి సదుపాయం కల్పించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విద్యుత్ మోటార్లను అందించారు. ఆయా విద్యుత్ మోటార్ల ద్వారా గ్రామ రైతులు పంటలు పండించి జీవనోపాధి పొందుతున్నారు. కాగా డిసెంబర్ 3న గ్రామంలో విద్యుత్ పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అదే రోజు రాత్రి దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి దానిలో ఉన్న రాగి వైరుతో పాటు కూరాకుల సత్యారావు పొలంలో విద్యుత్ మోటారును పట్టుకుపోయారు. దీనిపై లైన్‌మేన్ చంద్రరావుకు రైతులు ఫిర్యాదు చేసినా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. దీంతో ఎండలకు మామి డి, నరుగుడు, అపరాల పంటలు, కూరగాయలు ఎండిపోతున్నాయని, అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశం కోసం ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవచ్చునని బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తరగతి చదువుతున్న వారు 5వ తరగతిలో ప్రవేశానికి, పదో తరగతి చదువుతున్న వారు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులు అని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్మీడియేట్‌కు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

గ్రామాల్లో పగలే విద్యుత్ వెలుగులు



జగ్గంపేటలో పగలే వెలుగుతున్న వీధి లైట్లు

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో పగలే వెన్నెల కాసే పరిస్థితులు ఏర్పడ్డాయి. రాత్రి పూటే కాదు పగలు కూడా జె.నాయుడుపాలెం పంచాయతీ శివారు జగ్గంపేటలోను, కొంతలం పంచాయతీ తదితర గ్రామాల్లో వీధిలైట్లు మంగళవారం వెలుగుతున్నాయి. ఈ విషయాన్ని సాక్షి గ్రామస్తుల వద్ద ప్రస్తావించగా పంచాయతీ వారి ఆధీనంలోనే వీధి లైట్లు విద్యుత్ వినియోగం ఉంటుందని, దీనిపై ఇక్కడ పని చేసే సిబ్బంది తగు చర్యలు తీసుకొని దుబారాని అరికట్టాలని కోరుతున్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక

చోడవరం : చోడవరం శ్రీ గౌరీ శంకర్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా బెరా శివాజీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బెరా వెంకట్రావు, డైరక్టర్లుగా ఇంటి ఈశ్వరరావు, ఇంటి శంకరరావు, మురమర్ల రాము, వానపల్లి దేముళ్లు, బెరా శ్రీను ఎన్నికయ్యారు. 207మంది సభ్యులు ఉన్న ఈ సొసైటీలో 188 మంది సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఫిషర్‌మెన్ డిపార్టుమెంటు నుంచి శివాజీ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

గిట్టుబాటు ధరల చట్టం చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

అనకాపల్లి టౌన్: రైతులు పండించే వివిధ పంటలకు గిట్టుబాటు ధరల చట్టం పార్లమెంట్‌లో చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం అచ్యుతాపురం మండలం నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈ నెల 14న ఢిల్లీలో దల్లే వాల్ కమిటీతో రైతు సంఘాలతో జరిగే చర్చలు జయప్రదం కావాలని, వివిధ రకాల 23 పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు రుణమాఫీ చేయాలని, తదితర డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ సిబ్బందికి ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కె. రామ సదాశివరావు, నాగేశ్వరరావు, కొండకర్ల పాల సంఘం అధ్యక్షుడు నూకరాజు, ప్రకాష్, బుద్ద రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల పండగలు



దిబ్బిడిలో పైడితల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు



దిబ్బిడిలో హుషారుగా పరుగులు తీస్తున్న ఎడ్లు



గోవాడ పరదేశమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో పలు గ్రామాల్లో గ్రామదేవతల పండగలను ఆయా గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మంగళవారం దిబ్బిడి, పెదమదీన, చినమదీన, గున్నెంపూడి, నేతవానిపాలెం తదితర గ్రామాల్లో పరదేశమ్మ, తాళమ్మ, పరదేశమ్మ దేవతల పండగలను ఉత్సాహంగా నిర్వహించారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమలతో పాటు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు దేవతామూర్తులకు తలనీలాలు సమర్పించి అమ్మవారిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. దిబ్బిడిలో పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. పలు గ్రామాల్లో సాయంత్రం బాణసంచా వెలిగించారు. నేల డాన్సులు, తప్పెటగుళ్లు, కోలాటాల నడుమ అమ్మవారి సంబరం సాగింది. రాత్రికి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి. పలు గ్రామాల్లో యువకులు ఆలయాల వద్ద భక్తులకు ఉచితంగా ప్రసాదాలు, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను అందించారు.

చోడవరం : మండలంలో 14 గ్రామాల్లో గ్రామదేవతైన శ్రీ పరదేశమ్మ అమ్మవారి పండగ మహోత్సవం సందడిగా జరిగింది. గోవాడ, దుడ్డుపాలెం, కన్నంపాలెం, రామజోగిపాలెం, బెన్నవోలు, చాకిపల్లి, పీఎస్‌పేట, గంధవరం, కొత్తపల్లి తోపాటు పలు గ్రామాల్లో శ్రీ పరదేశమ్మ అమ్మవారి పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. దేవాలయంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేకపూజలు చేశారు. గోవాడలో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో పండగ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. అమ్మవారిని దర్శించుకోవడాని పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం తీర్థం జరిగింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యుత్ అలంకరణ అందర్నీ ఆకట్టుకుంది.

మోదమాంబకు వెండి ఆభరణాల బహూకరణ



ఎం.కోడూరులో మోదమాంబ అమ్మవారికి వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి దాతలు సహకారంతో తయారు చేయించిన వెండి సింహాలను మంగళవారం ఆలయంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. జాలంపల్లి గ్రామానికి చెందిన గొర్లె శ్రీనివాసరావు, కొండాజీ దంపతులు కుమారులు అనుదీప్, శ్రీలత దంపతులు, దిలీప్, శేషు దంపతులు కలిసి అరకిలో వెండిని, ఎం.కోడూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఎస్‌ఐ పోతిన వెంకటరమణ, త్రివేణి దంపతులు కుమార్తెలు లక్ష్మీప్రసన్న, సౌజన్య పావు కిలో వెండి, కొప్పుశెట్టి రాజ్ కుమార్ లక్ష్మీ దంపతులు అరకిలో వెండిని సమర్పించారు. ఈ వెండితో తయారు చేసిన వెండి సింహాల బొమ్మలను సర్పంచ్ సంజీవిరావుకు అందజేశారు. వీటిని అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, పడాల అప్పలనాయుడు, మండల యూత్ విభాగం అధ్యక్షుడు కలిమి గోపాల్, పోతిన జగదీష్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు




ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామి వారు

మాడుగుల రూరల్ : మండలంలో వీరవల్లి అగ్రహారం గ్రామంలో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి వార్షిక కళ్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ ధర్మకర్త దొండా వరహాలుదొర(కుమార్) పర్యవేక్షణలో, ఆలయ ప్రధాన అర్చకులు కిశోర్ పూజలు నిర్వహించారు.

నేడు నాగవల్లి సంబరాలు

కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి నాగవల్లి సంబరాలతో పాటు చక్రస్నానం, జరుగుతుందని అనంతరం ఉదయం స్వామి వారి తిరువీధి ఉత్సవం వి.వి.అగ్రహారంలో, సాయంత్రం బంగారుమెట్ట గ్రామంలో తిరువీధి ఉత్సవం జరుగుతుందని ధర్మకర్త కుమార్ తెలిపారు. ఈ నెల 13న స్వామి వారి పుష్పాంజలి సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

నేటితో ముగియనున్న దేవితల్లి తీర్థం



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరీ దేవి అమ్మవారు

దేవరాపల్లి: దేవరాపల్లి గ్రామ ప్రజలు ఆరాధ్య దైవం శ్రీ ఉమామహేశ్వరీ దేవి (దేవితల్లి) తీర్థం, కళ్యాణ మహోత్సవాలను ఆఖరి రోజు బుధవారం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 8 నుంచి ప్రారంభమైన తీర్థమహోత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి ప్రతి రోజూ పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ముగింపోత్సవాల సందర్భంగా ఆలయానికి వెళ్లే దారిలో విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించి, విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.18వేలు, రూ.16 వేలు, రూ.14 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ. 2వేలు చొప్పున నగదు బహుతులను అందజేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



గొండుపాలెంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామస్థులు ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవంను మంగళవారం ఘనంగా జరిపారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని జరిపారు. స్వామివారికి స్థానిక ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ ప్రత్యేక పూజలు జరిపారు. తీర్థం సందర్భంగా మహిళా కోలాటాలు, వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు నగదు పురస్కారాన్ని అందించారు.